నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

ఫిర్యాదులను స్వీకరించిన జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్



మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ప్రజల నుంచి మంగళవారం ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు తమ వ్యక్తి గత సమస్యలతో పాటు గ్రామానికి చెందిన సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మిగతా వారి సమస్యలు సైతం త్వరలోనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు వినోద్, రమేష్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ రగడ

- ప్రోటోకాల్ పాటించకపోవడంతో మార్చిన శిలాఫలకం

నవతెలంగాణ-రామారెడ్డి



ప్రోటోకాల్ పాటించకుండా, పదవి పూర్తయిన అన్ని తానై, శిలాఫలకంపై ప్రజాప్రతినిధుల పేర్లు లేకుండానే ప్రారంభోత్సవం నిర్వహించడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. ఆవిష్కరించిన శిలాఫలకాన్ని మార్చి ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకాన్ని రెడ్డిపేటలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ నెల 12న గ్రామీణ అంగడి రూ.16.95లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టగా నాబార్డ్ నుంచి రూ.15లక్షలు, జీపి కాంట్రిబ్యూషన్ రూ.1.95లక్షలతో నిర్మించి, 12వ తేదీ నాబార్డ్ మేనేజర్‌తో పాటు మాజీ సర్పంచ్ పేరుపై శిలాఫలకం ఉండడంతో, మండల స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడటంతో, అధికారులు నూతనంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు.

అట్టహాసంగా కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం

- వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ
- పాల్గొన్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో మినీ ట్యాంక్ బండ్‌ను అనుకుని నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసపు ఏర్పాట్ల నడుమ మంగళవారం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్మూలోని ఐ.ఐ.ఎం నుంచి వర్చువల్ విధానం ద్వారా కేంద్రీయ విద్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేయగా, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ శాసన సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ తదితరులు ఈ సంరంభంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి అరవింద్ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయాలను ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తోందన్నారు. 2014 వరకు రాష్ట్రంలో కేవలం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలలోనే కేంద్రీయ విద్యాలయాలు ఉండేవని అన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లా కేంద్రంతో పాటు బోధన్,



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

మిర్యాలగూడ, మహబూబాబాద్, సిరిసిల్ల వంటి అనేక పట్టణాల్లోనూ కేంద్రీయ విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. నిజామాబాద్‌లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.28 కోట్లు వెచ్చిస్తూ అన్ని వసతులతో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పదవ తరగతి వరకు కొనసాగుతున్న ఈ విద్యాసంస్థలో త్వరలోనే 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బోధన్ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం పనులను కూడా మరింత వేగవంతం చేసి వచ్చే ఏడాది నుంచి సొంత భవనం అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతు మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయానికి ఎంతో ఆహ్లాద కర వాతావర ణంలో అన్ని వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. అయితే, నేటి రోజుల్లో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి చేస్తున్న పరిస్థితి నెలకొందని కలెక్టర్ ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పిల్లలు మానసిక వికాసా న్ని పెంపొందించుకో లేకపోతున్నారని, సమాజంలో మన చుట్టూ జరిగే పరిస్థితులను ఆకళింపు చేసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. మానసిక దృఢత్వం కలిగి ఉంటే, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా కూడా ప్రోత్సహిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు సరైన బాటలు వేయాలని కలెక్టర్ హితవు పలికారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయాలలో చదువుకున్న వారు దేశభక్తిని పుణికిపుచ్చుకుంటారని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బోధకులకు సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఆవరణలో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు అవసరమైన నిధులను సొంతంగా తాను సమకూరుస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కార్పోరేటర్ మమత, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరింపజేశాయి.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఆర్టీసీ 62 ఖాళీ స్థలాలకు అద్దె టెండర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ రీజియన్ పరిధిలో వివిధ డిపోలలో గల బస్‌స్టేషన్‌లలో ఖాళీగా ఉన్న 62 ఖాళీ షాపులు, ఖాళీ స్థలాలకు అద్దెకు ఇవ్వడానికి కాంట్రాక్ట్ వేలం ద్వారా టెండర్లు కోరుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్ మేనేజర్ కె.జాన్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన టెండరు ఫారములను సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 21 నుంచి 29 వరకు ఉదయం 10:30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొందవచ్చునని, ఆ టెండర్ ఫారాలను పూర్తిచేసి మార్చి 01 ఉదయం 10 : 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రీజినల్ మేనేజర్ కార్యాలయంలో గల టెండర్ బాక్స్‌లో వేసి రశీదు తీసుకోగలరని అన్నారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ బాక్స్ ఓపెన్ చేయబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ http//tsrtc.telangana.gov.in చూడాలని సూచించారు.

మున్సిపల్ వాటర్ వర్క్స్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ వాటర్ వర్క్స్ (సీఐటీయూ) కమిటీని రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కందారపు రాజనర్సును ఎన్నుకోగా.. ప్రధాన కార్యదర్శిగా పోతారం ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్ శంకర్, ఉపాధ్యక్షులుగా జనార్ధన్, బి.గంగాధర్, ఎస్.నాగరాజు, టి.రాజు, మూదాం కృష్ణ, కోశాధికారిగా కుమ్మరి నర్సింలు, జాయింట్ సెక్రటరీగా అబ్బాస్, మీసాల రవి, అంగళ్ళ భూలక్ష్మి, అన్నపెల్లి శ్రీనివాస్, కె.సాయిలు, గౌరవ అధ్యక్షులుగా చంద్రశేఖర్, (సిఐటియు జిల్లా కన్వీనర్‌ను), కార్యవర్గ సభ్యులుగా అంజమని, ఆర్.రాములు, ఎ.శంకర్, భాస్కర్, కే ప్రభు, కే లింగం, మల్లవ్వ, అంజత్, రాజు, బి.నరేష్, డి.నవీన్, నీలం, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో కార్మికులందరూ ఏకగ్రీవంగా ఈ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ కమిటీ కార్మికుల క్షేమం కోసం, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తుందని వివరించారు.



ఎన్నికైన కందారపు రాజనర్సు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

ఐదో విడత నిజాంసాగర్ నీటి విడుదల

- ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి పంటసాగు కోసం మంగళవారం నుంచి ఐదో విడత నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజనీర్ శివ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. నీటిని వృథాగా పోనివ్వకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రతిరోజు 1600 క్యూసెక్కుల చొప్పున 10 రోజులపాటు నీటిని వదులుతామని ఆయన తెలిపారు. రైతులందరూ గమనించగలరని ఆయన సూచించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.915 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు.

జనత ప్రమాద బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సహకార సంఘం ఆధ్వర్యంలో జనత ప్రమాద బీమా చెక్కును అందజేసినట్లు పిఎసిఎస్ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు కిచన్నపేట్ సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉన్న అర్చనపల్లి సాయవ్వ ప్రమాదవశాత్తు మరణించిందని జనతబీమా ద్వారా వచ్చిన లక్ష రూపాయల చెక్కును మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట సిఈఓ జైపాల్‌రెడ్డి, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

అవయవదానంపై అవగాహన



అవయవదానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం, ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సెలబ్రేషన్‌లో భాగంగా జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు జీవన్‌దాన్ ఆర్గనైజేషన్ సహకారంతో అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఇఓ ఎస్.రాజు, తెలంగాణ బయోసైన్సు ఫోరం అధ్యక్షులు ప్రతాపరెడ్డి, డియస్ఓ సిద్ధిరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి అవయవదానం చేయడం ద్వారా చనిపోయిన తర్వాత బతికి ఉండవచ్చునన్నారు. అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దీనికోసం సైన్స్ ఉపాధ్యాయులు ముందుండాలని పేర్కొన్నారు. పది రోజుల క్రితం చనిపోయిన కానిస్టేబుల్ బెజ్జంకి కార్తీక్ అవయవదానం చేసి ఇంకా జీవించే ఉన్నాడని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఇటువంటి కార్యక్రమాల్లో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణాకర్‌రావు, సురేష్, హనుమంత్ రెడ్డి, రాములు, శరత్, సుప్రియ, సుజాత, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్వో



ఆస్పత్రిని తనిఖీచేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని డిప్యూటీ డిఎంహెచ్ఓ, మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రతి సోమవారం, మంగళవారం నిర్వహించే అమ్మఒడి కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు గర్భిణీ స్త్రీలు సరైన సమయంలో న్యూట్రిషన్ కిట్లు అందడం లేదని డిప్యూటీ డిఎంహెచ్వోకు తెలియజేయగా త్వరలోనే అందేవిధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి యేమిమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, పిహెచ్ఎన్ రాణి, స్టాఫ్‌నర్స్ హరిత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట మాజీ సర్పంచ్ భువనరి పద్మ నాగరాజు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివితి కిష్టయ్య, ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీలో టైం కోసం ఎదురుచూస్తున్నా

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ప్రజల సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీలో టైం కోసం ఎదురుచూస్తు కూర్చుంటున్నానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు అన్నారు. మండలంలో షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి లబ్దిదారులకు 65 మందికి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ప్రజల సమస్యలపై పోరాడేందుకు అసెంబ్లీలో 12 గంటలకు పాటు టైం కొరకు ఎదురుచూస్తూ సమస్యలు సభలో వివరిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లోపల సరైన వసతులు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమకు తోచినంతగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నీటి సమస్య తీర్చడానికి మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి మరమ్మతుల కొరకు రూ.కోటి మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా నాగిరెడ్డిపేట్ మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన చెప్పారు. ఎల్లారెడ్డి ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు లేక గుడిసెలలో ఉంటూ పాములతో తేళ్లతో సహవాసం చేస్తున్నారన్నారు. తొందరలోనే ఎల్లారెడ్డి అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎల్లారెడ్డి ఆర్‌డిఓ ప్రభాకర్, ఎంపీపీ రాజదాస్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో పర్బన్న, ఎంపీఓ శ్రీనివాస్, నాయకులు రామచంద్రరెడ్డి బోయిని విట్టల్, నరసింహారెడ్డి, వాసురెడ్డి, గులాము హుస్సేన్, లక్ష్మణ్, ఇమామ్, సాయికుమార్, హనుమాన్లు, శేఖర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎమ్మెల్యేను సన్మానించిన ఎంపీటీసీలు

మండల కేంద్రంలో షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నాగిరెడ్డిపేట్ ఎంపీటీసీలు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజధానితోపాటు ఎంపిటిసిలు కంచన్పల్లి మాధవి, శ్రీనివాస్, వినీతరెడ్డి, నారాయణ, విమల, సుజాత, కో ఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపిన ఎంపీటీసీలు

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పంపిణీ చేశారు. ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమంలో తాము లేకుండానే చెక్కులను పంపిణీ చేశారని ఎంపీపీ రాజధాస్, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీటీసీలు ఎంపీపీ, కార్యాలయంలో నిరసనకు దిగారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ లక్ష్మణ్ 'పొరపాటు జరిగింది. ఇంకెప్పుడు రిపీట్ కాకుండా చూసుకుంటాం' అని ఎంపిటిసిలను కోరారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీటీసీలు అధికారులు పంపిణీ చేశారు.

మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-బోధన్

సాలురా మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటారు. 9వ తరగతి చదువుతున్న చరణ్ తేజ్ రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు, 5వ తరగతి చదువుతున్న రిత్విక రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు, మహేవిషి జిల్లా 2వ ర్యాంకులు సాధించారు. మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ్ అభినందించి సన్మానించారు. అలాగే జిల్లాస్థాయిలో కన్సోలేషన్ బహుమతి పొందిన 10వ తరగతి విద్యార్థి కృష్ణ ప్రసాద్, ఎనిమిదో తరగతి విద్యార్థి సాక్షి, సంధ్యారాణిని ఆంధ్ర, తెలంగాణ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లతా రాజు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడం గర్వించదగ్గ విషయమని, రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తామని తెలుపుతూ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న జయప్రకాశ్ నారాయణ్

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని సహిత విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్స ఫిజియోథెరపీ వైద్యులు వెంకటస్వామి నిర్వహించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఫిజియోథెరపీ చికిత్సపై అవగాహన, పలు సూచనలను వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి, కాంప్లెక్స్ సీఆర్పి మహమ్మద్, ఉపాధ్యాయులు సృజన, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగ విద్యార్థులకు చికిత్సలు

ఖాళీగా ఆర్‌అండ్‌బీ ఏఈ పోస్ట్

నవతెలంగాణ-బోధన్

గత రెండున్నర సంవత్సరాలుగా బోధన్‌లో ఆర్‌అండ్‌బి శాఖ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన బి.కరుణాకర్ డిప్యూటేషన్‌పై యాదాద్రి జిల్లాకు వెళ్లిపోయారు. ఆయన డిప్యూటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేస్తే గాని బోధన్ మండలానికి తిరిగిరాలేని పరిస్థితి. దాంతో ప్రస్తుతం ఏఈ చేయవలసిన పనులు సైతం డిప్యూటీ ఈ.ఈ రామ్మోహన్ చూసుకుంటున్నారు. ఆర్‌అండ్‌బి శాఖకు సంబంధించిన పనుల నిమిత్తం ఎవరైనా కార్యాలయానికి వస్తే ఏ.ఈ కుర్చీ ఖాళీగానే దర్శనమిస్తుంది. డిప్యూటీ ఈ.ఈ రామ్మోహన్ తన పనుల నిమిత్తం డివిజన్ అంతట తిరగడం, సమావేశాలకు హాజరుకావడంతో బోధన్ కార్యాలయం బోసిపోతుంది. అధికారులే లేని కార్యాలయంలో ఇద్దరు అటెండర్లు, ఒక డ్రైవర్ విధులు నిర్వహిస్తూ ఉంటారు. ప్రభుత్వం తక్షణమే బోధన్‌కు ఆర్‌అండ్‌బీ ఏఈని కేటాయించాలని మండల వాసులు కోరుతున్నారు.

స్త్రీనిధి రుణాల టార్గెట్‌ను పూర్తి చేయాలి

- స్త్రీనిధి ఆర్ఎం రాందాస్ స్పష్టీకరణ



మాట్లాడుతున్న శ్రీనిధి ఆర్ఎం రాందాస్

నవతెలంగాణ-రెంజల్

బ్యాంక్ లింకేజీ రుణాలను ఏ విధంగానైతే టార్గెట్ పూర్తి చేశారో అలాగే శ్రీనిధి రుణాల టార్గెట్‌ను పూర్తి చేయాలని శ్రీనిధి ఆర్ఎం రామ్‌దాస్ ఐకెపి సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో నిర్వహించిన మహిళ సమైక్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి రుణాలను ఈ నెలాఖరులోపు కనీస 30లక్షలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రుణాలను చెల్లిస్తూ తిరిగి రుణాలు పొందాలని ఆయన సూచించారు. మార్చిలోపు శ్రీనిధి రుణాల టార్గెట్‌ను పూర్తి చేయడానికి తాము తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామని ఐకెపి ఏపిఎం చిన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం చిన్నయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి స్వరూప, సంయుక్త కార్యదర్శి లావణ్య, సీసీలు భాస్కర్, శివకుమార్, కృష్ణ, రాజయ్య, సునీత, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యతో పాటు సృజనాత్మకత అవసరం

- ఎంఈవో దేవీసింగ్

నవతెలంగాణ-పిట్లం



పాఠశాలకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

విద్యతో పాటు సృజనాత్మక అవసరమని మండల విద్యాధికారి దేవీసింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని విద్యావ నరుల కేంద్రంలో ఆయా పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు కథలు, ఉద్యమ నాయకుల జీవిత కథలు, నవల పుస్తకాలు అందించినట్లయితే సృజనాత్మకత పెంపొందుతుందని భావించిన ప్రభుత్వం పాఠశాల లైబ్రరీల ద్వారా పుస్తకాలు అందిస్తూ ప్రోత్సహి స్తున్నందున ఆయా పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విట్టల్, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, జ్యోతి, సీఆర్పీలు హైమద్ పాషా, గోపాల్ ఠాకూర్, విట్టవ్వ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
బుధవారం | ఫిబ్రవరి 21, 2024 | www.navatelangana.com

ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు



నవతెలంగాణ-ముప్కాల్

ఆర్మూర్ ఏసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బస్వారెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ముప్కాల్ ఎంపీపీ భర్త సామ వెంకట్ రెడ్డి కలిశారు. ఈసందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతలు, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంతి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఇటీవల సబ్జెక్ట్ నాలెడ్జ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షలో కాంతిహైస్కూల్‌కు చెందిన అభినయ్, రంగోజ విజేతగా నిలువగా మనస్విని, సుజల్ కన్సొలేషన్ బహుమతులు సాధించినట్టు స్కూల్ ఫౌండర్-కరస్పాండెంట్ గంగారెడ్డి మంగళవారం తెలిపారు. వారి అద్భుతమైన ప్రదర్శనను అభినందించారు. ఇతర విద్యార్థులందరూ దీనిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సమగ్ర కుల గణన చారిత్రాత్మక నిర్ణయం

- మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం



మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

శాసనసభలో బీసీ సమగ్ర కుల గణన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో పట్టణ అధ్యక్షులు దొండి రమణ ఆధ్వర్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు మొత్తం కాంగ్రెస్ కు ఓటు వేసి అధికారం తెచ్చినట్లే... లోక్ సభ ఎన్నికల్లో కూడా 17 స్థానాలు గెలిచే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఇది చారిత్రాత్మక నిర్ణయం అని బీసీలు పట్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తన ప్రేమను చాటుకుందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి బీసీల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సాయిబాబా, జిమ్మి రవి, తోపారం భగత్, పింజ అభినవ్ రాజ్, భూపేందర్, చిట్టి రెడ్డి,చిట్యాల రవి కొంత మురళి, మీసాల రవి కాంగ్రెస్ నాయకులు, వినయ్ రెడ్డి సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న డిసిపి



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని లింబాద్రిగుట్టపైగల లక్ష్మీ నరసింహ స్వామిని డిసిపి జయరాం సతీ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను గురించి డిసిపి అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ అర్చకుడు నంబి పార్థసారథి డీసీపీని సన్మానించారు. డిసిపి వెంట భీంగల్ ఎస్సై హరి బాబు ఉన్నారు.

కిడ్స్ పార్క్ స్కూల్‌లో మ్యాజిక్ షో



మెజీషియన్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలంలోని కిడ్స్ పార్క్ స్కూల్లో కిడ్స్ పార్క్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మ్యాజిక్ షోను ప్రదర్శించారు. కార్యక్రమంలో మెజీషియన్ బాబుమియా తన మాయాజాలంతో పిల్లలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ మ్యాజిక్ షో అనేది మనకు సైన్స్ నేర్పుతుందని ఇందులో ఏ విధమైన అపోహ ఉండదని, కేవలం కొన్ని ట్రిక్స్ ప్రయోగించి ఈ మ్యాజిక్ షో నిర్వహించడం జరుగుతుందని పిల్లలకు తెలిపారు. బాబుమియా 50 రకాల మ్యాజిక్‌లను ప్రదర్శించారు. అనంతరం పాఠశాల యజమాన్యం మెజీషియన్ బాబు మియాను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల కార్యవర్గం ఏర్పాటు





నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఆఫీస్ అసిస్టెంట్ షిప్ గ్రూపు కాంట్రాక్ట్ అధ్యాపకునిగా పనిచేస్తున్న వై. భాస్కర్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, నిజామాబాద్ జిల్లా బాధ్యునిగా నియమించామని రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మధు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఒకేషనల్ మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ గ్రూపు కాంట్రాక్టు అధ్యాపకురాలు కిరిటా సుహాసిని రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలుగా నియమించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 411 మంది ఒకేషనల్ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ కోసం తమ రాష్ట్ర కార్యవర్గం కృషి చేస్తుందని తెలియజేశారు.

22న సెపక్ తక్రా జట్ల ఎంపికలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 22న జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాల, బాలికల జూనియర్, సబ్ జూనియర్ జట్ల ఎంపికలు ఉంటాయని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేశ వేణు, గాధరి సంజీవ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24,25 తేదీల్లో నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. సబ్ జూనియర్‌కు 1-1-2009 తరువాత జన్మించిన వారు, జూనియర్‌కు 1-1-2004 తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈ ఎంపికలు ప్రెసిడెన్సీ పాఠశాల మోపాల్‌లో ఈనెల 22న ఎంపికలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికలో పాల్గొనాలని పేర్కొన్నారు. మిగిత వివరాల కోసం జిల్లా సెపక్ తక్రా ఆర్గనైజషన్ సెక్రెటరీ చామ కూర బాగారెడ్డి ఫోన్ నెంబర్ (8985870006.) ను సంప్రదించాలని తెలిపారు.

పరిమళ పద కుసుమం..

తెలుగు భాష.. మేలుకోకుంటే కనుమరుగే.. నేడు మాతృభాషాదినోత్సవం

నేడు బుధవారం ప్రపంచ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం...

గత మెంతో ఘనం అని చెప్పుకోదానికేనా....

ప్రపంచంలో 6 వేల భాషలు ఉన్న ఇప్పటికే మూడు వేల భాషలు కనుమరుగయ్యాయి.. మరో 100 భాషలు తుది శ్వాస చేరుకున్నట్లు యునేస్కో నివేదిక ఇచ్చింది. ఈ విషయం అందరిలో ఆలోచన కలిగించాల్సి ఉన్న స్పందన అంతంత మాత్రంగానే ఉంది.. ఇప్పటికైనా మేల్కొనక పోతే అమృత తుల్యమైన భాషగా పేరుపొందిన మన తెలుగు భాష తెలంగాణ యాస కనుమరుగయ్యే కాలం ఎంతో దూరంలో లేదని అభిమానులు అంటున్నారు. గత మెంతో ఘనం అని చెప్పుకోవడానికి తప్ప నేడు అమ్మ భాష అంతంత మాత్రంగానే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమలు మాత్రం పూర్తి స్థాయిలో కనిపించటం లేదు. ఉన్నతాధికారులు 100శాతం అమలు చేయాలన్న గంటాపరంగా చెబుతున్న క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదు ..అధికారులు ఆదేశించినప్పుడు మాత్రమే తూతూ మంత్రంగా వీధి నిర్వహిస్తూ మనకెందుకులే అని చేతులు దులిపేస్తున్నారు.

కొన్ని ఉదాహరణలు...

సహసంరక్షణ వేదిక అధ్యక్షులు అంకం నరేష్ జిల్లాలోని పంపిణీ చేసిన పశుగ్రాసం విత్తనాలు జంతువదల మార్గదర్శకాల వివరాల గురించి గతంలో పశువర్ధక శాఖకు దరఖాస్తు చేస్తే కార్యాలయ సాంకేతిక పదాలతో ఆంగ్లంలో అర్థం కాకుండా ఇవ్వడం... జక్రాన్ పెల్లి మండలంలోని పడకల గ్రామంలో సహ ఉద్యమకారునిగా పనిచేసిన జలంధర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని ఎయిడ్స్ రోగుల వివరాలు, ఏఆర్‌పి కేంద్రాల వివరాల కోసం దరఖాస్తు చేస్తే ఆంగ్లంపై అవగాహనలేని దరఖాస్తుదారులకు ఆ సమాచారం ఎలా అర్థమవుతుంది. ఆలూరు మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సాయినాథ్ గతంలో జిల్లాలోని రేషన్ డీలర్ల అక్రమాలు పట్టుకున్న రేషన్ సరుకుల వివరాల గురించి జిల్లా పౌరసరఫరాల కార్యాలయానికి దరఖాస్తు చేస్తే సమాచారం మొత్తం ఆంగ్లంలో ఇచ్చి అన్ని సాంకేతిక పదాలు ఆ శాఖ అధికారులకే అర్థం కాకుండా ఇవ్వడం జరిగింది. నేడు విద్యాసంస్థల్లో మాతృభాషకంటే ఇంగ్లీష్ చదువులపైనే ఆసక్తి చూపుతున్నారు.. గ్రామంనుంచి రాష్ట్రస్థాయి వరకు మాతృభాష అమలు చేయాల్సిన అవసరం ఉన్న ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో పూర్తి కాకుండా పోతుంది.

నవతెలంగాణ-ఆర్మూర్

శిశువుకు తల్లిపాలు ఎలాంటివో.. ఓ విద్యార్థికి మాతృభాష బోధన అలాంటిది అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ మాతృభాష గొప్పతనాన్ని గుర్తించి తమ అరుదైన రచనలతో భాషకు పట్టాభిషేకం చేశారు. ఏ భాష నీది.. ఏమి వేషము రా... ఈ భాష ఈ వేషం ఎవరికోసం రా.... ఆంగ్లమందున్న మాటలు అనగానే ఇంత మక్కువ ఎందుకోసం రా.., తెలుగు వాడవై తెలుగు రాదని సిగ్గు లేక ఇంకా చెప్పుట ఎందుకురా అన్నారు.. కాళోజీ నారాయణరావు. మానసిక వికాసం కోసం మాతృభాష ఎంతో దోహదం చేస్తుందని కానీ నేటి కాలంలో ప్రపంచీకరణ నేపథ్యం ప్రపంచ సాంకేతిక ప్రభావంతో మనదైన స్వచ్ఛమైన భాష కనుమరుగై పోతోంది.

మాతృ భాషకు పట్టం..

మంథని పాఠశాల విద్యార్థుల ప్రతిభ ఘనం...

మండలంలోని మంతిని ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నట్లు తెలుగు ఉపాధ్యాయులు కోకిల నాగరాజు తెలిపారు. రైతు గోస" , "మట్టి బంధం", "ప్లాస్టిక్ భూతం" , "ఈ ఫోన్ మాకొద్దు", "భూమిని బతికిద్దాం" , "యుగాది" సీ"రియల్ గోల" , "కత్తుల బావి"

"ఓ అర్చన కథ" ఇవన్నీ హై స్కూల్ స్థాయి విద్యార్థులు రాసిన నాటికలు అంటే ఆశ్చర్యపోక తప్పదు. ప్రతి నాటికలో చక్కని సందేశాన్ని ఇస్తూ, నవ్విస్తూ చిన్న వయసులోనే "ముచ్చట్లు" అనే నాటికల సంకలనాన్ని రూపొందించి రాష్ట్రస్థాయిలో అనేక ప్రశంసలు అందుకున్నారు మంథని ఉన్నత పాఠశాల విద్యార్థులు. రంగనాయక శతకం" పుస్తక రచన ద్వారా హై స్కూల్ స్థాయిలోనే చందోబద్ధంగా పద్యాలు రాయడం ఈ విద్యార్థుల కృషికి నిదర్శనం.



అప్పటి కలెక్టర్ టీవీ రాయుడు స్ఫూర్తితో...

మాతృభాష అమలుకు గతంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్గా పని చేసిన టీవీ రాయుడు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. తన వద్దకు వచ్చే దస్త్రాలు తప్పకుండా స్థానిక మాతృభాషలో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. అమలుకై తెలుగులో రాయనందుకు తిప్పి పంపడమైనదని ముద్ర వేసేవారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు భవనాలకు తెలుగులో పేర్లు ఉండాలని అన్ని కార్యకలాపాలను పూర్తిగా తెలుగులోనే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని అమలుపరిచిన అధికారిగా రాష్ట్రంలోనే గుర్తింపు పొందారు. వీరి తర్వాత అప్పటి సీనియర్ న్యాయమూర్తి రచయిత బంగారి రాజేందర్ తెలుగులోనే తొమ్మిది తీర్పులు ఇచ్చి మాతృభాషపై తన అభిమానాన్ని చాటుకున్నారు.

బోధనకే పరిమితం కాకూడదు....



ఉపాధ్యాయుడు కేవలం బోధనకే పరిమితమైతే విద్యార్థులు అద్భుతాలు సాధించలేరు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలు వెలికి తీసి అన్ని రంగాల్లో వారిని తీర్చిదిద్దినప్పుడే ఆ విద్యార్థి గొప్పగా ఎదుగుతాడు. మా మంథని విద్యార్థులు సాహిత్య సేవా సాంస్కృతిక సేవ రెండింటిలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. నేను నా వంతు ప్రయత్నంగా నాలో ఉన్న సాంస్కృతిక కళలలో వారిని తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్న. దీనికి తల్లిదండ్రుల సహకారం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతగానో ఉంది.

."కోకిల" నాగరాజు, తెలుగు భాషోపాధ్యాయులు, మంతిని.

జగమెరిగిన భాష మనది...



అమ్మతనం మాతృ ప్రేమ ఎంత స్వచ్ఛగా ఉంటాయో అలాంటిదే మాతృభాష జగమెరిగిన భాష మనది.. తల్లి భాష ఎప్పటికీ మరిచిపోవద్దు. మంచి ఫలితాలు సాధించాలంటే తల్లి భాషలోనే సాధ్యం ఈ విషయాన్ని అందరూ తెలుసుకొని అమలు కోసం కృషి చేయాలి.

... మాద వేడి పద్మావతి,,, ప్రాథమిక పాఠశాల, గోవింద్ పెట్.

చిన్నిదివ్వెలు" కవితల పుస్తకాన్ని చిట్టిపొట్టి కవితలతో రాసి అబ్బురపరిచారు..

దేశభక్తి గేయాలు, జానపద గేయాలు, శతక ధారణ, అభినయ గేయాలు ఈ పాఠశాల పిల్లలకు వెన్నతో పెట్టిన విద్య అంతర్జాతీయ వేదికలపైన ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాణం పోసిన "కోకిల" నాగరాజు వీరికి గురువుగా ఉండటమే వీళ్ళందరి ఘనతకు ముఖ్య కారణం.

తనకొచ్చిన కళలు తన పిల్లలందరికీ పంచాలి అన్న తపనతో విద్యార్థులకు నృత్యం, గానం, ఏకపాత్ర, బుర్రకథ, నాటిక రచన, పద్యరచన, కవిత రచన ఇలా అనేక అంశాలలో శిక్షణనిస్తూ విద్యార్థులను నాగరాజు తీర్చిదిద్దుతున్నాడు.

సృజనాత్మక రచన ద్వారా విద్యార్థులు ప్రతిరోజు ఏదో ఒక అంశంపై స్వీయ రచన చేయడం అందులోని తప్పొప్పులను సరిదిద్దడం ఇక్కడ నిత్య కృత్యం. ఆరవ తరగతి నుండే విద్యార్థులు సొంతంగా రచనలు చేయడం విశేషం.

చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రతిరోజు ఉదయం 8:30 నుండి 9:30 వరకు ప్రత్యేకంగా బోధన చేస్తూ మళ్ళీ సాయంత్రం పాఠశాల వేళలు పూర్తయిన తర్వాత కూడా నాట్యం, గానం, రచన వంటి వివిధ సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ విద్యార్థులను నాగరాజు తీర్చిదిద్దుతున్నాడు.

వ్యాసరచనలో జాతీయస్థాయిలో నాట్యంలో రాష్ట్రస్థాయిలో గానంలో రాష్ట్ర , జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అనేక సాహితీ సంస్థల ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలో అనేక బహుమతులు సాధించారు. విద్యార్థుల ఉన్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తూ మాతృభాష సేవలో తరిస్తున్న నాగరాజు గత ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకోవడంతోపాటు అనేక అంతర్జాతీయ జాతీయ రాష్ట్రస్థాయి అవార్డులు సాధించారు.

అరవింద్... ఐదేండ్లు గాడిదలు కాశావా

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత ఎన్నికల్లో పసుపు బోర్డు, పసుపు మద్దతు ధర తెస్తానని బాండ్ పేపర్ రాసి ఇచ్చి, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి ఈ ఐదు సంవత్సరాలు ఎక్కడ గాడిదలు కాశావో ప్రజలకు చెప్పాలని మానాల మోహన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై ఎంపీ అరవింద్ అహంకారంతో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండి,ఇనేజ మంగళవారం కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని, అరవింద్‌కు వ్యతిరేకంగా బిజెపి నాయకులు చేస్తున్న పనుల వెనుక కాంగ్రెస్ నాయకులు ఉన్నారని, ఎంపీ అరవింద్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. అసమర్థుడైన అరవిందును ఎంపీగా గెలిపించడం వల్ల ఏమీ అభివృద్ధి జరగలేదని,



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

అలాంటి వ్యక్తిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకొనడం ఇష్టం లేక ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల ప్రజలు చెంప ఛెళ్లుమనిపించేలా అక్కడి నుండి అరవింద్‌ను తరిమేశారని తెలిపారు. అసమర్థ అరవింద్ ఎంపీ కావడం ఇష్టంలేని బీజేపీ కార్యకర్తలే అరవింద్ కు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తూ, కరపత్రాలు పంచుతున్నారని అన్నారు. అబద్ధపు హామీలతో ఐదు సంవత్సరాలు కాలం గడిపిన ఎంపీ అరవింద్ కు ప్రజలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్తారని, అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో అరవింద్‌కు జరిగిన పరాజయమే మళ్లీ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో జరుగుతుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

మార్చి 3న ఖమ్మంలో జరిగే విప్లవ పార్టీల ఐక్యత మహాసభల పోస్టర్లను సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పంథా, సిపిఐ ఎంఎల్ ఆర్ఐ పీసీసీ, సిపిఐ ఎంఎల్ మూడు విప్లవ ఐక్యత జాతీయ మహాసభలను మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు, రైతు కూలీలు హాజరై విజయవంతం చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో నాగన్న, రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న, గోపాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల వద్దకే 'సమ్మక్క-సారలమ్మ' ప్రసాదం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మేడారం మహా జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజనుల పండగ. మేడారం జాతరకు వెళ్ళలేని భక్తులకు ఇంటి వద్దకే 'సమ్మక్క- సారలమ్మ' ప్రసాదం (బంగారం) అందజేయాలని టీఎస్ఆర్టిసి అధికారులు నిర్ణయించారని నిజామాబాద్ రీజియన్ ఏటీఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ తలంబ్రాలు, బంగినపల్లి మామిడి పళ్ళు విజయవంతంగా మీ ఇంటి వద్దకే చేరవేశామని పేర్కొన్నారు. భక్తులకు మరింత దగ్గర అయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ప్రసాదం (బంగారం)తోపాటు అమ్మ వారి పసుపు, కుంకుమను భక్తులకు టీఎస్ఆర్టి కార్గో వారు అందించనున్నారు అని, ఈ సదావకాశం ఈ నెల 25 వరకు భక్తులు నేరుగా లాజిస్టిక్స్ కౌంటర్ల వద్ద (పెటీ ఎం యాప్) ప్రసాదం బుక్ చేసుకొనవచ్చుఅని, ప్రసాదం బుక్ చేసుకొనే భక్తులు నిజామాబాద్ రీజియన్‌లోని అన్ని లాజిస్టిక్స్ కౌంటర్ల వద్ద రూ 299 చెల్లించి బుకింగ్ టికెట్ పొందాలని తెలిపారు. ఈ ప్రసాదం (బంగారం) బుక్ చేసుకున్న వారికి జాతర పూర్తి ఐన తర్వాత తమ సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి ప్రసాదాన్ని మీకు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రసాదాన్ని అందించిన సమయంలో మీరు మా సిబ్బందికి ఎటువంటి అదనపు చార్జీలు చెల్లించనవసరం లేదని తెలిపారు. మేడారం ప్రసాదం (బంగారం) బుకింగ్ కొరకు నిజామాబాద్ రీజియన్‌లో డిపోల వారీగా ఆర్మూర్ డిపో వినోద్ 9550232626, బోధన్ డిపో షాహిద్ 9014296638, నిజామాబాద్-1 మురళి 9154298727, నిజామాబాద్ -2 సాయికుమార్ 7396889496, బాన్సువాడ ఇర్ఫాన్ 91542729, కామారెడ్డి రాజు 9154298730, ఆర్ఎం ఆఫీస్ నిజామాబాద్ ఈ.కాశీరామ్- 8639969647, 9154298731 నెంబర్ లకు సంప్రదించండి అని, భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉమ్మడి జిల్లా నిజామాబాద్‌లో జాతరకు వెళ్ళలేని భక్తులు ఆర్టీసి అందిస్తున్న సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రసాదాన్ని బుక్‌చేసుకోవాలని, ఈ సేవలు ఈ నెల 25 వరకు మాత్రమే ఉంటాయనిచేసుకోవాలని డిప్యూటీ ఆర్ఎం సరస్వతి తెలిపారు.

ఈ కేవైసీని తప్పక చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయధికారి

నవతెలంగాణ-నవీపేట్

రైతులు కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం కిసాన్‌కోసం ఈ కేవైసీ తప్పక చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంతోపాటు పోతంగల్, నాలేశ్వర్ గ్రామాలను వ్యవసాధికారి సురేష్ గౌడ్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ కేవైసీ చేసుకోని రైతుల వివరాలను తెలుసుకొని వారిని కలిసి ఈ కేవైసీ చేసుకోవాల్సిందిగా సూచించారు. మండల కేంద్రంలోని పిఏసిఎస్‌తోపాటు దేవి, అలివేణి, కిసాన్ ఎఫ్‌పివో ఎరువుల డీలర్ల స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. బినోల సొసైటీ పరిధిలోని నాలేశ్వర్ ఎరువుల గోదామును తనిఖీ చేశారు. కార్యక్రమంలో బినాల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, పృథ్వీరాజ్, ఏతఉ వసంత్, సొసైటీ కార్యదర్శులు రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో ఎంఎల్‌హెచ్‌పి ఎంప్లాయిస్ చేరిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పి హెల్త్ డిపార్ట్‌మెంట్లో పనిచేస్తున్న ఉద్యోగులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజు జార్జ్ సమక్షంలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సంజు జార్జ్‌లు మాట్లాడుతూ.. హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఎంప్లాయిస్ గురించి నిరంతరం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాజీలేని పోరాటం చేయడం ద్వారా ఎంప్లాయిస్ ఆకర్షితులపై చేరడం జరిగిందన్నారు. కేంద్రప్రభుత్వం హెల్త్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న ఎంప్లాయిస్ సమస్యలను పరిష్కరించాలని ఎంఎల్‌హెచ్‌పిగా పనిచేస్తున్న వాళ్ళని సిహెచ్‌ఎలుగా గుర్తించాలని వేతనాలు పెంచాలని, పిఎఫ్ ఇతర చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలని, 120 రోజుల మెటర్నిటీ లీవులు మూడు సంవత్సరాల సర్వీస్ దాటిపోయిన వారందరిని పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్త్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న ఎంప్లాయిస్‌కి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం బకాయి వేతనాలు చెల్లించటం లేదన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అక్షయ్, తబిత, పాముల వంశీ, వంశీ, దివ్య తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరుతున్న ఎంఎల్‌హెచ్‌పి ఎంప్లాయిస్

బాగేపల్లిలో సీతరామ చంద్రలక్ష్మణ హనుమాన్ నవగ్రహ ప్రతిష్టాపన మహా యజ్ఞం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో మంగళవారం గురువారం వరకు వేదమంత్రాలతో ప్రతిష్టాపన మహెూత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సాయాగౌడ్, గోపాల్, సాయిబాబాగౌడ్ పేర్కొన్నారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో సీతరాముల వారి ఆలయంతో పాటు, ఆంజనేయ, నవగ్రహాల ఆలయాలను నిర్మించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి కర కమలములతో యంత్ర ప్రతిష్టాపన చేయనున్నట్లు తెలిపారు. మంగళవారం వేదపండితులతో మహాయజ్ఞాన్ని నిర్వహించి, గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు స్కూలు బ్యాగులు పంపిణీ



నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ప్రైమరీ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు స్కూలు బ్యాగుల పంపిణీ చేసినట్లు బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు ఎల్పీ పోచయ్య, ఈర్ల రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు కటికల శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇంచార్జ్ సగ్గు రవి, బూత్ అధ్యక్షులు అనిల్, రాకేష్, స్థానిక యువ నాయకులు సంతోష్, శ్రీను, అబ్బన్న అశోక్, సాయి, అనిల్, ఐటీ సెల్ కన్వీనర్ యోగేష్, మైపాల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే ఈ స్థాయిలో ఉన్నా..

- అసెంబ్లీలో ఎల్లారెడ్డి గళం వినిపించాను
- నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.120 కోట్ల నిధులు
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-లింగంపేట్

కార్యకర్తల కృషితోనే నేను ఈ స్థాయిలో ఉన్నానని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాను ప్రత్యేకంగా రూ.120 కోట్ల అభివృద్ధి మంజూరు చేసినట్టు తెలిపారు. అలాగే తాను ప్రమాణ స్వీకారం చేసిన 68 రోజుల్లో సుమారుగా 1000 చెక్కులు పంపిణీ చేశానన్నారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెనువెంటనే పంపిణీ చేస్తున్నామన్నారు. నేడు ఒక్కరోజులోనే సుమారుగా 600 చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. లింగంపేట్‌లో 28 గ్రామాలకు చెందిన వారికి ఒక్కరోజులోనే 127 చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యకర్తల కృషితోనే తాను ఈ స్థాయిలో ఉన్నానని వివరించారు. అభివృద్ధి విషయంలో తాను రాష్ట్ర అసెంబ్లీలో ఎల్లారెడ్డి గళం వినిపిస్తున్నానని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా వెనుకబడిందన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలు కాంట్రాక్టు పనులు చేసుకోవాలని, ఒక్క పైసా నాకు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కొరకు రూ.120 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, జడ్పీటీసీ శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎంపీపీ గరీబ్ నిషా, వైస్ ఎంపీపీ విట్టల్‌రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, ఎమ్మార్వో కాలిచరణ్, ఎంపీటీసీ శమిమున్నిసా ఫతియొద్దీన్, పిఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు రాజయ్య, ఎల్లమయ్య అశోక్, మాజీ ఎంపీపీ హాసియ, మహీద్ రామ్‌రెడ్డి, ఎంపిఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ నారాగౌడ్, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..

ఎల్లారెడ్డి(లింగంపేట్) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏ అధికారైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఖరాకండిగా హెచ్చరించారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎంఅండ్‌హెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడుతూ.. ఆసుపత్రికి వైద్యులను, సిబ్బందిని వెంటనే నియమించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యం చేయకుంటే ఎవరినైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, ప్రభుత్వ వైద్యాధికారి రవీంద్ర మోహన్, కాంగ్రెస్ నాయకుడు కురుమ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు బిసి సెల్ మండలాధ్యక్షులు నారేడ్ల సాయిలు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. బిసి కులగణన బిల్లు ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షాన నిలబడుతుందని, బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ బీసీలకు అండగా ఉండటం అభినందనీయమని అన్నారు. బీసీ గణాంక బిల్లును ఆమోదపరిచిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కులకర్ణి సురేష్‌బాబా, టౌన్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్, ఉపాధ్యక్షులు రెడ్డి రాంబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ గంగప్ప, మైనారిటీ మండల అధ్యక్షులు శంషుద్దీన్, సేవాదళ్ మండల అధ్యక్షులు హనుమంతరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నేమాని వీర్రాజు, ముత్యాల కృష్ణ, మక్కపల్లి హనుమాన్లు రాజు, ముక్తార్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డిఎస్పి సత్యనారాయణ



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్పి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నూతనంగా బాన్సువాడ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. 100 డయల్ కేసుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి నీరుపోశారు. కార్యక్రమంలో సిఐ నరేష్, ఎస్ఐ కోనారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తడిపొడి చెత్తను తప్పనిసరిగా సేకరించాలి

- బోధన్ డీ.ఎల్.పీ.ఓ సాయిబాబా

నవతెలంగాణ-బోధన్

ప్రతి గ్రామపంచాయతీలో ప్రతి ఇంటి నుంచి వేరుచేసిన తడి పొడి చెత్తను తప్పనిసరిగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి అక్కడ ఏర్పాటు చేసిన గదులలో నిల్వ చేయాలని బోధన్ డిఎల్పిఓ సాయిబాబా సూచించారు. మంగళవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో ఎడపల్లి, రెంజల్, బోధన్ మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌లో ప్రతిరోజు ఇండ్లలో నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి ఉంచాలని ఆదేశించారు. అలాగే ఇంటి పన్నులను మార్చి చివరి వరకు 100శాతం వసూలు చేయాలని అన్నారు. హరితహారంలో విభాగంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలను మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అలాగే కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విశ్వకర్మ పథకానికి సంబంధించి అర్హులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఆయన్ను ఆయా మండల పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. సమావేశంలో బోధన్ ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఎంపీఓ మధుకర్, ఎడపల్లి, రెంజల్ మండల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సాయిబాబా

బోధన్ డివిజన్ పంచాయతీ అధికారిగా సాయిబాబా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-బోధన్

బోధన్ డివిజన్ నూతన పంచాయతీ అధికారిగా సాయిబాబా మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. బోధన్‌లో డిఎల్పిఓగా పనిచేసిన మహమ్మద్ గౌసొద్దిన్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో సాయిబాబా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ డివిజన్‌లోని గ్రామపంచాయతీల బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పేస్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

పేస్కేల్‌తో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా ఉపాధి హామీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పిడి పద్మజ రాణిని కలిసి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న పద్మజా రాణిని కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బలరాం నాయక్, కొండయ్య, నరేందర్, శ్యామ్, హుస్సేన్ తదితరులున్నారు.

పోడు భూములపై పూర్తి హక్కు కల్పిస్తాం

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు

నవతెలంగాణ-పిట్లం

బంజారాలకు పోడు భూములపై పూర్తి హక్కులు కల్పించే బాధ్యత తీసుకుంటానని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గస్థాయి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోడు భూములపై అధికారం మీది, ఆ భూమిని లబ్ధి పొందుతూ రుణాలు సైతం పొందవచ్చునని తెలిపారు. ఎవరి పెత్తనం చెలాయించే అధికారం లేదన్నారు. పోడు భూములపై పోరాడేందుకు తాను సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి తాండాలో విద్యుత్, తాగునీరు అందిస్తానన్నారు. పది రోజులలో నీటి ఎద్దడి గల తాండాలను గుర్తించి మంచినీరు అందించడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. 2016 నాటికి మండలంలో బంజారా భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బంజారాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించలేదని విమర్శించారు. మండల కేంద్రంలో బంజారా భవనం నిర్మిస్తామని నాన్చుడు ధోరణి అవలంబించిందని మండిపడ్డారు. నియోజకవర్గ ప్రజలకు ఏ ఇబ్బందులు, ఎంతటి సమస్యలున్నా పరిష్కరించడానికి తానున్నానని మరవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా గిరిజన విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, నాయకులు జంబిగే హన్మాండ్లు, రాంరెడ్డి, సూరత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బొడ్డ రాజు, రాజశేఖర్‌రెడ్డి, వీరు సంగప్ప దేశాయి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

అవిశ్వాస తీర్మానంపై కోర్టుస్టే



వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై ఈ 9న ఏడుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన నోటీసును ఆర్డీవోకు అందజేయగా, అవిశ్వాస తీర్మానంపై ఎంపీపీకి స్టే రావడంతో, స్టే కాపీని ఆర్డీవో వై.రంగనాథరావుకు మంగళవారం అందజేశారు. అందజేసిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, నాయకులు లింబాద్రి నాయక్, జంగం లింగం ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి



వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. కామారెడ్డి ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి ఎన్జీవోస్ కాలనీకి చెందిన కేసిరెడ్డి నరసింహారెడ్డి (55) అనే వ్యక్తి 17-2-24న ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో ఆయన భార్య సమత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కాగా నరసింహారెడ్డి కాలికి పోలియో ఉండటం వల్ల కుంటినట్టుగా నడుస్తాడు. ఇతని చేతిలో ఒక స్టిక్ పట్టుకొని కూడా ఉంటాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇతని ఆచూకీ తెలిసిన ఎవరైనా 8712686145 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల కేంద్రానికి చెందిన కూనింటి తుకారం గత సంవత్సరం నవంబర్ మాసంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ మంజూరు అయ్యింది. దాంతో మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్ మృతుని భార్య కూనింటి సావిత్రికి రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్సు ఇప్పించేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే ఎండీ.షకీల్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్త ప్రమాదవశాత్తు చనిపోయినచో కుటుంబంలో ఉన్న కుటుంబ సభ్యులు ఇబ్బంది పడవద్దని ఇన్సూరెన్స్ చెల్లించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సహకార సంఘం చైర్మన్ బి.శివకాంత్ పటేల్, హనుమాన్ మందిరం చైర్మన్ ఎల్మ దత్తు, గ్రామపెద్దలు వెంకట్‌పటేల్, బచ్చు రాజు, సరిడే యాదు, కందిమల్ గంగారాం, సాకలి నర్సింలు, సాకలి రాములు తదితరులు పాల్గొన్నారు.



ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నర్సరీల పరిశీలన



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలకు పని కల్పిస్తూ నర్సరీలను ఏర్పాటు చేయాలని గ్రామ కార్యదర్శి గౌతమికి వారు సూచించారు. నర్సరీలకు వేసవికాలంలో రెండుసార్లు నీటిని అందించాలని, నర్సరీల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని వారు పేర్కొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవి, ముత్యాలమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని శ్రీనల్ల మారెమ్మ దేవి, ముత్యాలమ్మ దేవి నూతన విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవంలో జడ్పిటిసి సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ నాయకులు పాల్గొని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం అగ్ని ముఖం అగ్ని ప్రతిష్టాపన సర్వదేవతా పూజలు హెూమములు నూతన విగ్రహాలకు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిమ్మశంకర్, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, సీనియర్ నాయకులు కదిరే గోపాల్‌రెడ్డి, గోసంగి సంఘం నాయకులు నూనె పుల్లయ్య, మిర్యాల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



నేడు బిచ్కుంద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కళ్యాణ మండపంలో నూతనం గా గెలుపొందిన జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావును బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఘనంగా సన్మానిస్తున్నట్టు మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు గడ్డం అరవింద్, కార్యదర్శి రమణ, బిచ్కుంద గ్రామ అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్ తెలిపారు. బిచ్కుంద గ్రామ మున్నూరు కాపు సంఘం సభ్యులు, కుల సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

వృక్షశాస్త్ర విభాగంలో సుంకరి శ్వేతకు డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ, వృక్షశాస్త్ర విభాగంలో సుంకరి శ్వేత కి మంగళవారం జరిగిన వైవా-వోక్ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎం.అరుణ పర్యవేక్షణలో శ్వేత "ఇకలాజికల్ స్టడీస్ ఆఫ్ టు లేక్స్ ఆఫ్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ విత్ రిఫరెన్స్ టు డైవర్సిటీ ఆఫ్ ప్లాంక్టానిక్ అండ్ మ్యాట్ ఫార్మింగ్ ఆల్గల్ కమ్యూనిటీస్" అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ వర్సిటీ కి సమర్పించారు. వైవా కార్యక్రమలో శ్వేత తన పరిశోధనలో నిజామాబాద్ జిల్లాలోని న్యాల్కల్, మంచిప్ప మంచినీటి చెరువులలో పెరుగుతున్న శైవలాల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఫలితాలపై సంతృప్తి చెంది తెలంగాణ యూనివర్సిటీ అధికారులు ఆమెకు డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎమ్. అరుణ, బివోఎస్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, డాక్టర్. ఎ. ఎ. హలీమ్ ఖాన్, డాక్టర్. దేవరాజు శ్రీనివాస్, డాక్టర్. వి. జలంధర్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

యాచకురాలి అంత్యక్రియలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆనారోగ్యంతో తులసమ్మ అనే యాచకురాలు (55సంవత్సరాలు) రైల్వే కోటర్స్ వద్ద మృతిచెందింది. అప్పటికే ఆమె మొఖమంత చీమలు, పురుగులుపట్టి ఉన్నాయి మరణించిన యాచకురాలకి భర్త ఉండగా తాను యాచకుడు కావటంతో అంత్యక్రియలు తన భార్యకు చేయలేని పరిస్థితి ఉన్నదని, రోడ్లపై ఉంటున్నామని అంత్యక్రియలు చేయలేని స్థితిలో ఉన్నానని తెలిపారు. 3వ ఠాణా ఎస్ఐ ప్రవీణ్ ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించమని కోరారు. దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ స్మశాన వాటికలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారని ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కాసుల సాయితేజ మద్ది గంగాధర్, జయదేవ్,వినోద్, రాజు, 3వ ఠాణా పోలీస్ సిబ్బంది రఘు తదితరులు పాల్గొన్నారు.

సత్యశోధక్ విద్యార్థుల విజయ ప్రభంజనం

- ఒలింపియాడ్‌లో రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు



అవార్డులు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్ పోటీలలో సత్యశోధక్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు సాధించారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతి ఆడిటోరియంలో అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి గణితంలో భార్గవ్ రెడ్డి (10వ), సైన్స్ లో కె. శ్రీనిధి, బి సహస్ర (8వ)లు అవార్డులు సాధించారు. జిల్లా స్థాయి గణితంలో కె.యశశ్విని (9వ), వి. సహర్ష (9వ), కె.యశ్విత (5వ), సైన్స్ లో బి. భవ్యశ్రీ (8వ), పి. ఆశ్రీతరెడ్డి (5వ) అవార్డులు సాధించారు. వీరితో పాటు పలువురు గణితం, సైన్స్‌లో ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, లోక్ సత్తాపార్టీ అధినేత జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో రాణించుటకు తరగతికి సంభదించిన విషయ పరిజ్ఞానం, జనరల్ నాలెడ్జి, సామాజిక అంశాలపైన అవగాహనతో సాధ్యమని అన్నారు. అవార్డులు సాధించిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య ఉపాధ్యాయులు అభినందించారు.

అనుచిత వాఖ్యల పట్ల ఖండన

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై ఎంపీ అరవింద్ అహంకారంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి వాఖ్యలు చేస్తే నియోజకవర్గంలో అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఐదు సంవత్సరాలలో ఎక్కడ అభివృద్ధి చెయ్యని అరవింద్ అహంకారంతో వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇలాంటివి పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

పదవ తరగతి అంతర్గత మార్కుల పరిశీలన


మార్కులు పరిశీలిస్తున్న హెచ్ఎం, ఎంఎన్‌వో

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఏర్గట్ల,తొర్తి,తడపాకల్, గుమ్మిర్యాల్,తాళ్ళరాంపూర్, ఏర్గట్ల కేజీబీవి పాఠశాలల్లో మంగళవారం పదవ తరగతి విద్యార్థుల యొక్క అంతర్గత మార్కుల పరిశీలన కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణాచారి, ఎంఎన్ఓ ఆనంద్ రావ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణాచారి మాట్లాడుతూ... అంతర్గత మార్కుల్లో భాగంగా విద్యార్థికి నాలుగు అంశాలు ఇచ్చి 20 మార్కుల పరీక్ష రాయించబడుతుందని అన్నారు. విద్యార్థి ప్రతిభను బట్టి 20 మార్కుల్లో ఎన్ని వస్తే అన్ని మార్కులను ఆన్లైన్లో పొందుపరుస్తామని అన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో 80 మార్కులు ఉంటాయని, ఇప్పుడు నిర్వహించిన 20 మార్కుల అంతర్గత పరీక్ష విద్యార్థికి కీలకంగా మారుతుందని తెలిపారు. పర్యవేక్షణలో సభ్యులుగా ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాస్, ప్రవీణ్ శర్మ, రాజగోపాల్, విజ్ఞరాజు, సాయన్న పాల్గొన్నారు.

విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సిరికొండ

మార్చి 3,4,5 తేదీలలో ఖమ్మంలో జరుగన్ను సీపీఐ (ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, పీసీసీ సీపీఐ(ఎంఎల్) విప్లవ పార్టీల ఐక్యత జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ కమిటీ సభ్యులు బి. బాబన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రావుట్ల గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి జాతీయ ఐక్యత మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. పేద ప్రజల హక్కుల కోసం, శ్రామిక వర్గ రాజ్యం కోసం ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలను నిర్వహించామని బాబన్న తెలిపారు. జాతీయ మహాసభల సందర్భంగా జరుగుతున్న గొప్ప బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బాబన్న పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు ఆర్. దామోదర్, మండల నాయకులు నాయకులు ఈ. రమేష్, బి. సర్పంచ్ సాయులు, గంగాదాస్, పెద్దసాయులు, నవీన్, చింటు, విష్ణు, షేక్ కదీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.2.50లక్షల ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం పచ్చలనడుకుడ గ్రామానికి చెందిన పి. వినోద్ అనారోగ్యంతో బాధపడుతూ హైదారాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. చికిత్స కొరకు ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ను సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.2 లక్షల 50వేల ఎల్‌ఓసి ని ఇప్పించారు. ఎల్‌ఓసి పత్రాన్ని మంగళవారం బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎల్ ఓసి ఇప్పించిన ముత్యాల సునీల్ కుమార్ కు బాధితుడు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

గురుకుల పోస్టులన్నీ డిసెండింగ్ ఆర్డర్లో భర్తీ చేయండి

- పిడిఎస్‌యూ, పివైఎల్ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గురుకుల పోస్టులన్నిటిని పైనుంచి కిందికి (డీఎల్, జెఎల్, పిజీటీ, టీజీటీ) పద్ధతిలో భర్తీ చేయాలని టిఎస్పిఎస్సి జేఎల్ ఫలితాలను వెంటనే ప్రకటించడంతోపాటు అభ్యర్థుల నుండి రిలింగ్విష్మెంట్ ఆప్షన్ తీసుకోవాలని, అలాగే పోస్టులు బ్యాక్ లాగ్‌గా మిగిలిపోకుండా రెండవ లిస్టును ప్రకటించాలని, అన్ని పోస్టులకు జనరల్ ర్యాంక్ లిస్టును ముందుగానే ప్రకటించాలని కోరుతూ పిడిఎస్‌యూ, పివైఎల్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా గ్రంథాలయ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనీష్ నవీన్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపాధ్యక్షులు కర్క గణేష్, అనిల్ మాట్లాడుతూ గురుకుల బోర్డు అసంబద్ధ నిర్ణయాలతో వేలాదిమంది నిరుద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ నియామకాలలో గురుకుల బోర్డు అన్యాయమైన, వివాదాస్పద నిర్ణయాలతో అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా గురుకుల ఉపాధ్యాయ నియామకాలలో మొదటగా పై స్థాయి ఉద్యోగాల (డీఎల్, జేఎల్) తర్వాత కింది స్థాయి ఉద్యోగాలు (పిజీటీ, టీజీటీ) భర్తీ చేయాలన్నారు. కాని ప్రస్తుతం అన్ని పోస్టులను ఇష్టారీతిన నియామకాలు చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి పరిస్తితిలో ఒకే వ్యక్తి ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలలో ఎంపిక అవ్వడం జరుగుతుందని మెజారిటీ పోస్టులకు ఇలాగే జరుగుతుందన్నారు. ఎక్కువ ఉద్యోగాలు వచ్చిన వ్యక్తి ఒక ఉద్యోగాన్ని తీసుకుని, మిగతా వాటిని వదిలేసి వెళ్లడం, ఆ ఉద్యోగాలు అలాగే ఖాళీగా ఉండిపోవడం జరుగుతుందన్నారు. ఈ విధంగా దాదాపు 3000 నుండి 3500 ఉద్యోగాలు బ్యాక్ లాగ్ పోస్టులుగా మిగిలిపోయే పరిస్థితి ఉన్నదని తెలిపారు. ఇలా వేల సంఖ్యలో పోస్టులు మిగిలిపోవడం వల్ల, మెరిట్ ఉండి కూడా ఉద్యోగం పొందలేక నిరుద్యోగులు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కావున ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పైస్థాయి నుంచి కిందిస్థాయికి పోస్టులను భర్తీ చేసేలా, రిలింక్విష్మెంట్ ఆప్షన్ లేదా 2వ లిస్ట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల నియామకాల్లో జనరల్ ర్యాంక్ లిస్ట్ ప్రకటించకపోవడంతో అభ్యర్థులకు అనేక అనుమానాలు వస్తున్నాయన్నారు. తక్షణమే గురుకుల సహా ఇతర పోస్టులు అన్నిటికీ జనరల్ ర్యాంక్ లిస్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. జూనియర్ లెక్చరర్ ఫలితాలను కూడా ముందుగా ప్రకటిస్తే మరింత మందికి న్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు అషుర్, కోశాధికారి నిఖిల్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, కిరణ్ పిడిఎస్యు నాయకులు సలీం, వర్ధన్ గురుకుల అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సైబర్ కేసులు వెంటనే నమోదు చేయాలి

- సీపీ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతీ పోలీస్ స్టేషన్ సైబర్ నేరానికి సంబంధించిన ధరఖాస్తురాగానే వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలోనిసైబర్ వారియర్స్, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ హాజరై మాట్లాడారు. సైబర్ ఫిర్యాదుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుని బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఎలాంటి సైబర్ నేరం జరిగింది.. ఏ నెంబర్ నుండి ఫోన్ వచ్చింది.. ఫిర్యాదుదారుని ఫోన్ నెంబర్.. ఈ-మెయిల్ ఐడి తదితర అంశాలు ఎఫ్ఐఆర్‌లో రాయాలని సూచించారు. సైబర్ సోషల్ మీడియాలో వాట్సప్ గ్రూప్లలో సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు తెలియచేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ ద్వారా ఆర్థికంగా నష్టపోయిన బాధితులు ముందుగా నేషనల్ క్రైమ్ విభాగం హెల్ప్ లైన్ నెంబర్ 1930 సమాచారం అందజేయడం ద్వారా సత్వరమే అందించే న్యాయంపై పోలీస్ స్టేషన్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ హెల్ప్ లైన్ నెంబర్ ద్వారా సంబంధిత బాధితుల ఖాతాలనుండి సైబర్ నేరగాళ్లు డబ్బును మళ్లించబడిన ఖాతాలకు సంబంధించిన లావాదేవిలను పూర్తిగా నిలిపివేస్తారని అన్నారు. బాధితులు నష్టపోయిన డబ్బు తిరిగి బాధితులకు వచ్చేందుకు పోలీస్ అధికారులు జరపాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాలకు సంబంధించి అంశాలతోపాటు వాట్సప్, ఫేస్ బుక్, యూ ట్యూబ్ , ట్విట్టర్ లాంటి సామాజిక మాధ్యమాల వేదికగా సైబర్ మోసాలకు సంబంధించి నమోదయిన కేసుల్లో సైబర్ నేరగాళ్లను గుర్తించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో స్టేషన్ పరిధిలో ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డియస్‌పి వేణుగోపాల్ రెడ్డి, సిఐ ముఖీద్ పాష, ఎస్ఐ పూర్ణేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ, హాజరైన సైబర్ వారియర్స్, సిబ్బంది

33 కుక్కల మృతిపై కేసు నమోదు


నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని మచ్చర్ల గ్రామంలో ఇటీవల 33 కుక్కలను చంపడంతో జంతు ప్రేమికులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రతరం అయిందని మూకుమ్మడి నిర్ణయంతో చంపివేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఇది కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జంతు ప్రేమికులు ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం హైదరాబాద్, నిజామాబాద్ చెందిన ఫోర్ సైనిక్ ల్యాబ్ నిపుణులు, పశు వైద్య అధికారుల సమక్షంలో పూడ్చిపెట్టిన కుక్కల మృతదేహాలను వెలికి తీసి పంచనామాకు తరలించారు.

ఉత్సాహంగా..ఉ ల్లాసంగా..

బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం

నృత్యాలతో అలరించిన విద్యార్థినులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, ద్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులు ఉల్లాసంగా... ఉత్సాహంగా పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. బాలికల కళాశాల వార్షికోత్సవ, వీడ్కోలు కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నుస్రత్ జహాన్ మాట్లాడుతూ.. జిల్లాలోనే నిజామాబాద్ బాలికల జూనియర్ కళాశాల ఉత్తీర్ణతలో, అడ్మిషన్లలో మొదటి స్థానంలో ఉందని అన్నారు. కళాశాలలో అన్ని వసతులతో పాటు సీనియర్ అధ్యాపకులతో బోధన చేస్తున్నట్టు తెలిపారు. వార్షిక పరీక్షలలో విద్యార్థులు అత్యధిక మార్కులతో పాటు మంచి ఫలితాలను సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కళాశాలలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, ఉచిత పుస్తకాలు, అధునాతన లేబరేటరీలు, లైబ్రరీ, ఉపకార వేతనాలతో నాణ్యమైన విద్యను అందిస్తూ ఇంటర్మీడియట్ బోర్డ్ నుంచి మన్నన పొందుతుందని అన్నారు. కళాశాలలోని తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం, ఉర్దూ మీడియం, ఒకేషనల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల అధ్యాపకులు లావణ్య, శైలజ, తెలుగు ఉపన్యాసకులు రాజేశ్వర్, లైబ్రేరియన్ కల్పన, అధ్యాపక బృందం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుండి ఎంఎండి వరకు ఆయకట్టుని కాపాడుకోవాలి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నీటిని దిగువకు కేటాయింపు కంటే ఎక్కువగా వదలద్దు

ఎస్సారెస్పీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఎస్సారెస్పీ నుండి మిడ్ మానేరు డ్యామ్ వరకు ఉన్న ఆయకట్టుని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ నుండి వరద కాలువ ద్వారా నీటిని దిగువకు కేటాయింపు కంటే ఎక్కువగా వదలద్దని, ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో ఇరిగేషన్ శాఖపై అధికారులతో మాట్లాడుతానన్నారు. మంగళవారం బాల్కొండ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి వెలుతూ మార్గమధ్యలో కమ్మర్ పల్లి మండలంలోని ఉప్లూర్ వరద కెనాల్ వద్ద ఆగిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వరద కాలువ ద్వారా దిగువకు నీరు వెళుతుండటం గమనించి అక్కడి నుండే ఎస్సారెస్పీ ఎస్ఈతో ఫోన్ లో మాట్లాడారు. ఎస్సారెస్పీ నుండి మిడ్ మానేరు డ్యామ్ వరకు గల ఎస్సారెస్పీ ఆయకట్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నందున ఎస్సారెస్పీలో ఉన్న నీటిని వరద కాలువ ద్వారా దిగువకు కేటాయింపు కన్న ఎక్కువ వెళ్లకుండా చూడాలన్నారు. డ్యాంలో నీటి స్టోరేజ్ ఎంత మేరకు ఉంది.. ఈ సీజన్ లో పంటలకు ఎన్ని టీఎంసీ లు అవసరం అవుతాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద కాలువ ద్వారా ఎట్టి పరిస్థితుల్లో కిందికి కేటాయింపు కన్నా ఎక్కువ నీరు వదలొద్దు అన్నారు.అలాంటి నిర్ణయాలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వంతో, ఇరిగేషన్ శాఖ పై అధికారులతో మాట్లాడుతా నన్నారు. లేకపోతే రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు.

మమ్మల్ని తప్పుదోవ పట్టించొద్దు...

నాగపూర్ వద్దగల 4 గేట్లలో వరద కాలువ ద్వారా ఒక గేట్ నుండి పూర్తిగా, మరో గేట్ నుండి పాక్షికంగా నీరు కిందికి వెళుతుందని రైతులు చెప్పడంతో మరోసారి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఎస్ఈతో మాట్లాడారు. వరద కాలువ ద్వారా నీరు వెళ్లడం లేదని మమ్మల్ని తప్పుదోవ పట్టించొద్దని, తప్పుడు సమాచారం ఇవ్వొద్దని వెంటనే వరద కాలువను హెడప్ చేసి ఆ గేట్లను మూసివేయించాలని సూచించారు. అక్కడ గేట్లకు తేనెతుట్ట ఉండటంతో మూయలేకపోయామని అధికారి చెప్పడంతో అది చిన్న సమస్య అని ఆ కారణంతో గేట్లు మూయకుండా నీరు దిగువకు వృధాగా పోనియ్యడం సబబు కాదన్నారు. తేనెతుట్టని తొలగించి వెంటనే నాగపూర్ వద్ద ఉన్న గేట్లను త్వరితగతిన మూసివేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

నర్సరీ పెంపకం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంపీడీవో సతీష్ కుమార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నర్సరీ పెంపకం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అర్గుల్ గ్రామంలోని నర్సరిని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. పొద్దున, సాయంత్రం నీళ్ల సక్రమంగా పట్టాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ కు సూచించారు. ఆయన వెంట ఏపిఓ రవి ఉన్నారు.

విహార యాత్రలో లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో చిన్నారులను విహారయాత్రలో భాగంగా విద్యార్థులందరూ సారంగాపూర్ టెంపుల్, అర్బన్ పార్క్, గుత్ప టెంపుల్ తదితర సందర్శించారని పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మంగళవారం తెలిపారు. విద్యార్థులందరూ చక్కగా ఆడుతూ పాడుతూ ప్రీ ప్రైమరీ విద్యార్థులు చక్కగా డాన్సులు చే స్తూ ఎంతో ఆనందంగా గడిపారు. పిక్నిక్ తీసుకురావడం వల్ల చిన్నారులందరు ఎంతో సంతోషంగా గడిపారని, మానసికంగా వారిలో జ్ఞానాన్ని పెంపొందించవచ్చని ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక, మొరం తరలించే వారిపై చర్యలు

చట్ట వ్యతిరేక పనులు చేసే విడిసిపైనా చర్యలు తప్పవు

ఆర్డీవో వినోద్‌కుమార్

నవతెలంగాణ ఆర్మూర్

పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని మండలాలలో అక్రమంగా ఇసుక, మొరంలను తరలించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వినోద్ కుమార్, ఏసిపి గట్టు బస్వారెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం డివిజన్లోని తహసిల్దార్లు, సిఐలు, ఎస్సైలు, మండల సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఇసుక మొర్రం అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. వీటిని ప్రభుత్వ పనులకు ప్రజలకు ఉపయోగపడేలా చేయాలన్నారు. గ్రామాలలో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని విచ్చలవిడిగా వ్యవహరించే గ్రామ అభివృద్ధి కమిటీపైనా చర్యలు చేపట్టాలన్నారు. విడిసిలతో ఇబ్బందులకు గురవుతున్న బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్ బ్రిడ్జి నుంచి కమ్మర్ పల్లి గండి హనుమాన్ వరకు 63వ జాతీయ రహదారి వెడల్పు పనులను సర్వేయర్లు సత్వరం పూర్తి చేయాలన్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పూర్తి చేసి అందజేయాలని ఆదేశించారు. ఆర్మూర్ తో పాటు మండలాల్లోని గ్రామాలలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కంచెను నిర్మించి రక్షించాలని చెప్పారు. కోటార్మూర్‌లోని నిజాంసాగర్‌కు చెందిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తికి నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో కార్యాలయం సూప రింటెండెంట్ శ్రీకాంత్, తహసిల్దార్లు గజానన్, కిరణ్మయి, రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, డివిజన్ సర్వేర్ శ్రీనివాస్, మండల సర్వేయర్ షికారి రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

రేపు ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు 22న భారీ ఎత్తున నిర్వహించేందుకు సార్వజనిక శివా జన్మోత్సవ సమితి మద్నూర్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఉదయం 10గటల నుంచి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని మధ్యాహ్నం 2గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటంతో శోభయాత్ర జరుగుతుందని ఈ జయంతి ఉత్సవాలకు భారీ ఎత్తున జనాలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జన్మదిన వేడుకలకు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ హాజరవుతున్నట్టు తెలుస్తోంది.

ఐకెపిలో లక్పతి దీదీ శిక్షణ



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని ఐకెపి కార్యాలయంలో మంగళవారం ఎన్ఆర్ఎల్ఎం పథకంలో లక్పతి దీదీ కార్యక్రమంలో భాగంగా టిఒటి శిక్షకులు జిల్లా ఐబీ డీపీఎం సుధాకర్ మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న 55 గ్రామ సంఘాలలో 80 మంది సభ్యులను గుర్తించి వారి వివరాలు మొబైల్‌లో డాటా ఎంట్రీ చేసి శిక్షణనివ్వనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్క మహిళా సభ్యురాలు లక్షాధికారి అయ్యేవిధంగా లక్పతి దిదిలో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో బీర్కూరు ఏపీఎం గంగాధర్, భిక్కనూర్ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు వెంకటేష్, రాజేశ్వరి, జయశ్రీ, శ్రీనివాస్, మాధురి, స్వాతి, ఆపరేటర్ నరేష్, అకౌంటెంట్ అన్నపూర్ణ, 42 గ్రామ సంఘాల వీవోఏలు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి కోసమే కులగణన

- పలువురి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : బీసీ జిల్లా అధ్యక్షులు రాజ నరేందర్ గౌడ్ ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటానికి పాలబిషేకం చేశారు. ఈసందర్భంగా ఓబీసీ జిల్లా అధ్యక్షులు డి. రాజ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. బిసిల అభివృద్ధి కోసమే కుల గణన చేపడుతుందని, మొదటి నుండి బిసిల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నుండి జనాభా లో బిసిలు ఎంత మంది ఉన్నారనేది స్పష్టమ్కైన లెక్కలు లేవని అందుకోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఈ కుల గణన చేపడుతున్నారని తెలిపారు. దీనివల్ల బిసిలకు సంక్షేమ ఫలాలు పెరుగుతాయని, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో బిసి మాజీ నగర అధ్యక్షులు నాగరాజు , మహిళ కాంగ్రెస్ నగర అధ్యక్షురాలు రేవతి , యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు పంచరెడ్డి చరణ్ , బోధన్ నియోజకవర్గ కిసాన్ కాంగ్రెస్ ఇంచార్జ్ శనిగరం కిషన్ , ఎన్ ఎస్ యు ఐ ధత్తు, ఆనంద్, సంతోష్ ,పరమేశ్వర్, స్వప్ పాల్గొన్నారు.

సిరికొండ : సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. అసెంబ్లీలో బీసీ కుల గణన బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాకారం రవి , జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎర్రన్న, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఆసిఫ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దిగంబర్, శోభన్, బాకారం సంతు, దేగం పెద్ద సాయన్న, రమేష్, ప్రవీణ్, సాగర్ రెడ్డి, ప్రసాద్,రాజ్ కుమార్, దేగం సురేష్, హర్షద్, అలీ, సలీం బిన్ అహ్మద్, మల్లేష్ యాదవ్, జాఫర్, ప్రవీణ్ రెడ్డి, దుమాల గంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు

డిచ్‌పల్లి : బీసీ కుల గణన బీసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోనే బీసీ కుల గణన సాధ్యమైందని, కేంద్రం దీనికి ఆమోదం తెలిపితే బీసీ రిజర్వేష న్లు పెరిగే అవకాశాలుంటాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్, డాక్టర్ శాదుల్లా, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు మాస్పెద్ది రాజన్న, ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, మురళి, మైనారిటీ అధ్యక్షులు ఇబ్రహీం, సాజిద్, ఎంపీటీసీ నర్సయ్య, కొర్రి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి డిఎస్పీగా నాగేశ్వరరావు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి డి.ఎస్.పిగా డి. నాగేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గత కొద్ది రోజులుగా డిఎస్పీగా పనిచేసిన ప్రకాష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావు బాధ్యతలను స్వీకరించారు.

అవగాహన ఉంటేనే అభివృద్ధి

- మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ అధికారిని రసూల్‌బి

నవతెలంగాణ-రెంజల్

నేటి సమాజంలో మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే అభివృద్ధి సాధిస్తారని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని రసూల్ బి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మహిళల హక్కులపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషులతో పోటీపడుతూ అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారని, వారికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంఈఓ గణేష్‌రావు, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, ఏపీఎం చిన్నయ్య, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ స్వప్న, సౌమ్య, కవిత, రెంజల్ అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జేపీఎస్‌లు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌ను జేపీఎస్‌ల సంఘం మండలాధ్యక్షుడు జాదవ్ మనోహర్ అధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోందని, కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని, సమయపాలన పాటించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించి ప్రజల సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లొంగస్ అనురాధ, బంగారుపల్లి సతీష్, చిన్నగుల్లా నాగయ్య, శ్రీనివాస్ ఖండేభల్లార్, ఆశోక్, చండేగాం వికాస్‌రెడ్డి, పడంపల్లి భరద్వాజ్, సోపూర్ ఆశోక్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

సంత్ రోహిదాస్ మహారాజ్ జయంతి ధర్మ జాగరణ

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని కొడిచరా గ్రామంలో సంత్ రోహిదాస్ మహారాజ్ జయంతి ధర్మ జాగరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భజన కీర్తనలు చేపడుతున్నారు.

సాగు వివరాలు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్




పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-నందిపేట్

రైతులు ఏ పంటలను పండిస్తున్నారు.. ఏ రకాలను ఎంచుకున్నారు.. ఎంత మొత్తం సాగు చేస్తున్నారు.. ఇప్పుడు ఇదే పనిలో పడ్డారు వ్యవసాయ అధికారులు. సర్కారు చేపట్టిన ఆన్ లైన్‌లో పంటల నమోదు ప్రక్రియను వ్యవసాయాధికారులు పగడ్బందీగా చేస్తున్నారు. మంగళవారం మండలంలోని మల్లారం గ్రామంలో చేపట్టిన యాసంగి పంటల నమోదును జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. గ్రామంలో వేసిన పంటల వివరాలు క్రాప్ బుక్కింగ్ యాప్ ద్వారా సుమారు 15 సర్వే నెంబర్లు గల పంట పొలాల నమోదును ఆయన పరిశీలించారు. ప్రతి రైతు పండిస్తున్న పంటలు యాసంగిలో సాగవుతున్న అన్ని రకాల పంటలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్ లైన్ లో సర్వే నంబర్ వారిగా నమోదు చేయాలని రైతులకు ఆయన సూచించారు. యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో పంటల నమోదు పక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట స్థానిక వ్యవసాయ అధికారిని జోస్నా భవాని విస్తీర్ణదికారులు, రైతులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కేసిట్ లెవెల్-2కు నలంద విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 2వ తేదీన ఈ అబ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు నిర్వహించిన కెసిట్ లెవెల్ ఒకటి రెండులో నలంద విద్యార్థులు క్వాలిఫై అయినట్టు యాజమాన్యం మంగళవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి 1,2,3,4,5 ర్యాంకులు సాధించారు. 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు గల విద్యార్థిని విద్యార్థుందరికీ నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ సర్టిఫికెట్లతో

సత్కరించారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరగబోయే లెవెల్-2 కి క్వాలిఫై అయ్యారని తెలిపారు. ఈ ఆదివారం జరగబోయే రాష్ట్రస్థాయి పరీక్షకు హాజరు అవుతారని చెప్పారు. ఐఐటీ బ్రాంచ్ ఇంఛార్జి టీచర్, ఒలంపియాడ్ స్కూల్ అక్షయ, వాసవి ,అలినా . హై స్కూల్ ఇంచార్జ్ హన్మండ్లు,ప్రవీణ్,సందీప్, అశోక్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మేడారం ఎఫెక్ట్..

బస్సులకోసం పడిగాపులు

- వచ్చిన బస్సులో ఫుట్‌బోర్డుపై వెళ్తున్న ప్రయాణికులు




నవతెలంగాణ-డిచ్‌పల్లి

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జిల్లా నుండి బస్సులు వేయడంతో గ్రామీణ ప్రాంతాలకు వచ్చే బస్సుల సంఖ్య తగ్గింది. దీంతో వచ్చిన బస్సుల్లోనే కిక్కిరిసి ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం సమయం లో బస్సులు సమయానికి రాక పోవడంతో కామారెడ్డి నుండి నిజామాబాద్ కు వేళ్ళే బస్సులో దాదాపు వందకు పైగానే ప్రయాణికులు వెళ్లారు. డ్రైవర్ బస్సు దిగి కొద్ది సేపు కింద కూర్చున్నారు. ఇంకో బస్సు వస్తే ఈ బస్సులో నుండి కొందరు వెళ్తారని అనుకున్న సాధ్యపడ లేదు. గత్యంతరం లేక ఫుట్ బోర్డుపై ఒంటి కాలిపై నిలబడి నిజామాబాద్ వరకు ప్రయాణించక తప్పులేదని ప్రయాణికులు వాపోయారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు జిల్లా నుండి ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు వేయడంతో సమయానికి బస్సులు లేక గంటల తరబడి పడిగాపులు కాయకు తప్పడంలేదు.

రాత్రి సమయంలో బస్టాండ్‌లోకి రాని ఎక్స్‌ప్రెస్ బస్సులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా రాకపోకలు సాగించు కోవచ్చని అదేశాలు ఇచ్చినప్పటి నుండి నేటి వరకు ఆర్మూర్, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, బోధన్ డిపోలకు చెందిన కొన్ని ఎక్స్ ప్రెస్ బస్సులు రాత్రి అయిందంటే జాతీయ రహదారి 44 పై, లేక సర్వీస్ రోడ్డు నుండి రాకపోకలు సాగిస్తున్నారు. ఎవరైన ఇందల్ వాయి మండల కేంద్రంలో దిగే వారు ఉంటేనే సర్విస్ రోడ్డుపై బస్సు ఆపుతున్నారు. ఆర్మూర్, నిర్మల్, మెట్‌పల్లికి గంటకో సారి బస్సులు వస్తుంటాయి. ఇవన్ని ఎక్స్ ప్రెస్ బస్సులే.. రాత్రి సమయంలో బస్టాండ్‌లో ఈ రూట్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు గత్యంతరం లేక టోల్ ప్లాజా వద్ద కు వెళ్ళి బస్సులు ఎక్కాల్సి వస్తోంద.ఇ ఇకనైనా ఆర్టీసీ అధికారులు దూరం ప్రాంతాలకు వెళ్లే బస్సులు బస్టాండ్ లోనికి వచ్చే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కోటపాటిని ఆశ్రయించిన బాధిత కుటుంబ సభ్యులు



నవతెలంగాణ-ఆర్మూర్

సౌదీ అరేబియాలోని హెయిల్ ప్రాంతంలో ఎడారిలో పని చేస్తూ 20 రోజుల క్రితం మృతి చెందిన సదాశివ్ నగర్ వాసి కుటుంబ సభ్యులు మంగళవారం ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహ నాయుడును సంప్రదించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. నారాయణ(66) ఆరు సంవత్సరాల క్రితం సౌదీకి వెళ్లాడని తెలిపారు. యజమాని రెండు సంవత్సరాలుగా జీతం కూడా ఇవ్వకుండా హింస పెట్టడం వల్ల మనస్థాపంతో నారాయణ గుండెపోటుతో చనిపోయాడని అన్నారు. 20 రోజుల తర్వాత స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని రప్పించడానికి కుటుంబ సభ్యులు తనను కలిసినట్టు కోటపాటి తెలిపారు. తమ తండ్రి మృతదేహాన్ని త్వరగా ఇంటికి రప్పించాల్సిందిగా వేడుకున్నారు. స్పందించిన కోటపాటి సౌదీలోని ఇండియా ఎంబసీ అధికారులకు, తెలంగాణ ఎన్ఆర్ఐ సెల్ అధికారి చిట్టి బాబుకు సమాచారం పంపి కావాల్సిన నోటరీ చేయించి పంపారు. అదేవిధంగా నారాయణ చేసిన పనికి 2 సంవత్సరాల జీతంతో పాటు ఆరు సంవత్సరాలకుగాను సంవత్సరానికి ఒక నెల జీతం అదనంగా కలిపి కుటుంబ సభ్యులకు పంపే ఏర్పాటు చేయాల్సిందిగా భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖకు వినతి పత్రం పంపారు. నారాయణ కొడుకు శ్రీనివాస్ కూడా అదే ప్రాంతంలో రెండు సంవత్సరాలు పనిచేసి ఆరోగ్యం క్షీణించి కిడ్నీలో చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటూ ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉన్నారని తెలిపారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెయ్యికోట్లు కేటాయించి, బోర్డు ఏర్పాటు చేయాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ



నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కలిసి ప్యాడ్స్, పెన్నులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం జడ్పీహెచ్ఎస్, హెచ్ఎం హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరవింద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరవింద్ మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు రాసి పాసైన విద్యార్థులందరూ జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందానికి జడ్పిహెచ్ఎస్, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

- ఏవో విజయ శేఖర్



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వరి పంటలో మొగి పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో విజయశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పోచారం గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడక్కడ మొగి పురుగు ఉధృతి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ మందును ఎకరాకు 400 గ్రాముల మిశ్రమాన్ని 2 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే ఆయా గ్రామాలలో ఏఈఓలకు సంప్రదించి మందులను వాడాలన్నారు.

హైమర్ లైట్స్, సీసీ బెడ్ ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరైన హైమర్ లైట్స్, సిసి బెడ్ పనులను ఎంపీటీసీ బోధనపు ఇందిరా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, సాయికిరణ్, మాజీ ఎంపీపీ ఆసియా మోయుదు, మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి, కత్తుల అంజయ్య కిషోర్‌రెడ్డి కో ఆప్షన్ నెంబర్ బాబు, జానీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యంపై అంగన్వాడీలో అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

బిబిపేట్ మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో అంగన్వాడీలో గల చిన్నారులకు విద్యా, వైద్యం అభివృద్ధి అంశంపై పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తినకముందు, తిన్నతర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలనీ జైభీమ్ సంఘం రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ వివరించారు. చదువులో పిల్లలు చురుకుగా ఉండేందుకు కృషి చేస్తున్న అంగన్వాడీ టీచర్, ఆయాలకు, గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలకు జైభీమ్ సంఘం ధన్యవాదాలు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో జైభీమ్ సంఘం దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కోఆర్డినేటర్ లావణ్య, అంగన్వాడి టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.